4న సీబీఐటీలో సుధీ-2025

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 4న జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ సుధీ-2025ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుంచు గ్లోరీ స్వరూప, అతిథిగా ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గొల్లపూడి కృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సర్కిల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సర్కిల్ పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

మహావీర్ కళాశాలలో నేటి నుంచి క్రీడాపోటీలు

మైలార్‌దేవ్‌పల్లి: మహావీర్ కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 3,4 తేదీల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, ట్రోఫీలతో పాటు నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. సోమవారం జరిగే క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు. మంగళవారం జరిగే ముగింపు ఉత్సవాలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. 20న కళాశాలలో టెక్నో మిస్ట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, కళాశాల చైర్మన్ ఎస్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



అత్తాపూర్: పేదలను ఆదుకునేందుకు నిరంతరం సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని అల్ ఖరీమ్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ ఖరీమ్ ఫహీమ్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని అత్తాపూర్ హుడా కాలనీలోని మజీద్ ఈ అశ్రఫ్‌లో నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు. తమవంతు బాధ్యతగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మౌలానా మహ్మద్ హబీబ్, రహమాన్ హుసేనీ, అబ్దుల్ మాజీద్, హఫీజ్, అబ్దుల్ జబ్బార్, మౌజూద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రసేన్ బ్యాంక్ సేవలు అభినందనీయం

గోల్కొండ: అగ్రసేన్ బ్యాంక్ సేవలు అభినందనీయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్‌లో బ్యాంక్ 5వ బ్రాంచ్‌ని ఆదివారం ప్రారంభించారు. నగరంలో మరో మూడు బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు బ్యాంకు సీఈవో సి.వి.రావు తెలిపారు. కార్యక్రమంలో వేమిరెడ్డి నర్సింహ్మారెడ్డి, మనీశ్ అగర్వాల్, అమ్రుత్‌కుమార్ జైన్, హరినారాయణ్‌రాతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యల్లేకుండా చర్యలు

యాకుత్‌పురా: రంజాన్ మాసం సందర్భంగా ట్రాఫిక్ సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్టేషన్‌లో మాట్లాడుతూ.. రంజాన్ నేపథ్యంలో స్టేషన్ పరిధిలోని హలీం విక్రయా కేంద్రాలు, స్థానిక వ్యాపారులతో సమావేశం నిర్వహించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించామన్నారు. సాయంత్రం వేళల్లో రద్దీ ప్రాంతాలైన దారుషిఫా, పురానీహవేలీ, అలీజాకోట్లా, యాకుత్‌పురా, ఎత్తేబార్‌చౌక్, బీబీ బజార్ చౌరస్తా, చెత్తబజార్ తలాబ్‌కట్టా ప్రాంతాల్లో రౌండ్ ది క్లాక్ రెగ్యులర్ సిబ్బందితో పాటు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక వ్యాపారులు కూడా తమ సూచనలు పాటించి సహకరించాలని ఆయన కోరారు.

పెరిగిన వైద్యసేవలు...

పెరగని వసతులు

- రెండు నెలలుగా డయాలసిస్ సేవలు
- ఆపరేషన్ థియేటర్ లేక అవస్థలు
- గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు కొంత కాలంగా మెరుగవుతున్నాయి. గతంలో లభించని వైద్య సేవలు ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. దీంతో రోగుల తాకిడి పెరుగుతోంది. అందుకు అనుగుణంగా సేవలందించేందుకు వైద్యులు కృషి చేస్తున్నారు. అయితే రోగులకు సరిపడ గదులు, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



శంషాబాద్ సామాజిక ఆరోగ్యకేంద్రం



ఆస్పత్రిలో సేవలు పొందుతున్న డయాలసిస్ రోగులు

• పెరిగిన సేవలు ఇలా..

ప్రభుత్వ ఆస్పత్రి లెక్కల ప్రకారం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వరకు 300 నుంచి 400 వరకు ఔట్ పేషెంట్లకు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. దీనికితోడు కొద్ది రోజులుగా వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులు, బాలింతలు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ప్రతినెల కనిష్ఠంగా 30 సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం డయాలసిస్ కేంద్రం ప్రారంభించడంతో అప్పటి నుంచి ప్రతిరోజూ డయాలసిస్ సేవలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురు లేదా నలుగురు రోగులు డయాలసిస్ సేవలు పొందుతుండగా వీరి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

• ఉచిత వైద్య పరీక్షలు...

ఓపీ ద్వారా ప్రతి రోగికి అవసరమైన వైద్య పరీక్షలన్నీ ఉచితంగా అందిస్తున్నారు. రోగికి అవసరమైన పరీక్షల కోసం రక్త,మల, మూత్ర నమునాలను తీసుకుని వాటిని ప్రభుత్వ డయాగ్నోస్టిక్ హబ్‌కి పంపి పరీక్షలు చేయించి రోగులకు రోగులకు రిపోర్ట్‌లు అందజేస్తున్నారు. ఇందులో అత్యంత ఖరీదైన అన్ని రకాల వైద్యపరీక్షలను కూడా ఉచితంగా అందిస్తుండటం గమనార్హం.

• ప్రధాన సమస్యలు ఇవీ..

- స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నాలుగేళ్ల క్రితం వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేయడంతో పాటు దాని స్థాయిని సైతం పెంచారు. అయితే అందుకు తగినట్లుగా ఆస్పత్రిలో వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిలో ఏడుగురు నర్సులు మినహా మిగతా అందరూ డిప్యూటేషన్ పైనే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పీడియాట్రిషన్, ఇద్దరు గైనకాలజిస్టులు, కంటివైద్యులు, డెంటిస్ట్, సహా ముగ్గురు జనరల్ డాక్టర్లతో పాటు ఏడుగురు నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఇతర సిబ్బంది ఉన్నారు.
- రికార్డుల ప్రకారం వీరి సంఖ్య రెట్టింపు ఉండాలి. ప్రస్తుతం ఉన్న వైద్యులకు సైతం ఇక్కడ ఉన్న గదులు ఏ మాత్రం సరిపోవడం లేదు. కేవలం నాలుగు గదుల్లో పూర్తి ఆస్పత్రి నిర్వహణ జరుగుతోంది.
- ఆపరేషన్ థియేటర్ కోసం నిర్మించిన గదిలో ప్రస్తుతం డయాలసిస్ కేంద్రం కొనసాగుతుండడంతో కేవలం సాధారణ కాన్పులు మాత్రమే చేస్తున్నారు. స్థాయికి అనుగుణంగా కనీసం ముప్పై పడకలు ఉండాల్సిన చోట ప్రస్తుతం పది పడకలు మాత్రమే ఉన్నాయి.
- వైద్య పరీక్షలకు హాల్‌ను వినియోగిస్తున్నారు. పూర్తి స్థాయి వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేస్తున్నా గదుల కొరత తీవ్ర సమస్యగా మారింది.



బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు

• ఆగిన పనులు..

హెచ్ఎండీఏ ద్వారా శంషాబాద్ పట్టణంలో రూ.14 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు, డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. అందులో ప్రభుత్వ ఆస్పత్రిని రూ.5 కోట్లతో 50 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏడాదిగా నిధులు విడుదల కాక పనులు నిలిచిపోయాయి. మరికొద్ది రోజుల్లో ప్రభుత్వ ఆమోదంతో పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. హెచ్ఎండీఏకు సంబంధించిన నిధులు విడుదలైతే సర్కారు దవాఖానాలో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశముంటుంది.

మెరుగైన సేవలందిస్తున్నాం



ప్రతిరోజు 300 మందికి పైగా ఓపీ సేవలు పొందుతున్నారు. గదుల కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో ప్రస్తుతం సాధారణ కాన్పులు చేస్తున్నాం. అత్యంత ఖరీదైన అన్ని రకాల వైద్యపరీక్షలకు సంబంధించిన నమునాలను తీసుకుని హబ్ ద్వారా ఫలితాలను అందజేసి వైద్య సేవలు అందిస్తున్నాం. గదుల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. రూ.5కోట్ల నిధులతో అదనపు గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

\- డాక్టర్ మైలారం దుర్గాలత

ఘనంగా ముగిసిన 'వర్వ్-2025'

గోల్కొండ: ఇంజినీరింగ్ కాలేజీ స్పోర్ట్స్ మీట్‌కు తమ కళాశాల వేదిక కావడం ఆనందంగా ఉందని షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. 11వ జాతీయ ఇంటర్ ఇంజినీరింగ్ కాలేజీ స్పోర్ట్స్ మీట్ ఫర్ ఉమెన్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టెబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ నికత్‌భాను హాజరై మాట్లాడుతూ.. తాను కూడా మహిళా విభాగంలో ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. డిలైట్ కంపెనీ డెలివరీ మేనేజర్ ఎం.అఖిల మాట్లాడుతూ..జీఎన్ఐటీఎస్ అలూమీనిగా తాను మరోసారి ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ చైర్మన్ జి.రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ అపర్ణ పల్లె, వర్వ్-2025 కన్వీనర్ డాక్టర్ ఎం.వీ.ఎల్.సూర్యకుమారి పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న శ్రీవిద్యారెడ్డి

డోర్ సమాజ్‌ను గ్రూప్–బీ లోనే కొనసాగించాలి

జియాగూడ: నిరుపేదలైన ఎస్సీ డోర్ కమ్యూనిటీని గ్రూప్–బీ లోనే కొనసాగించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కోరారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్ బూర్గుల రామకృష్ణ భవన్‌లో మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తార్ సిబ్బందిని ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జియాగూడ డోర్ సమాజ్ అధ్యక్షుడు దత్తు పోల్, ఉపాధ్యక్షుడు సురేశ్ గజరే, సభ్యులు వినోద్ చౌగ్లే, గణేశ్ కౌలే , ఉమేశ్ హిటకర్, రాజేంద్ర గజరే, జియాగూడ ఎంఐఎం ఇన్‌చార్జి ఫరూఖ్‌తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. గత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో డోర్ కమ్యూనిటీని షెడ్యూల్ కులాల్లో చేర్చారని దీంతో వీరికి సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా ఎదుగుదలకు సహకారం లభించిందన్నారు. సర్వే చేసినా యధావిధిగా గ్రూప్–బీ లోనే కొనసాగించాలని ఆయన విన్నవించారు.

'ఎన్ఐఏబీ'లో ముగిసిన వేడుకలు



వివిధ పోటీలలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని జాతీయ జంతు జీవ సాంకేతికత సంస్థ(ఎన్ఐఏబీ)లో మూడురోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. శుక్ర, శని, ఆదివారాల్లో విద్యావైజ్ఞానిక ప్రదర్శన, ప్రత్యేక ఉపన్యాసం మొక్కలు నాటే కార్యక్రమం, క్రీడా పోటీలను నిర్వహించారు. క్యాంపస్‌లో పలు రకాల మొక్కలను నాటారు. ఇదిలా ఉండగా ఎన్ఐఏబీ హైదరాబాద్ క్యాంపస్‌లో క్రీడా పోటీలనుగత నెలరోజులపాటు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. విధులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఈ వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించగా వాటిల్లో క్రీడాస్ఫూర్తితో ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్రీడాపోటీలలో గెలుపొందిన వారికి ఎన్ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ జి తరుశర్మ బహుమతులను అందించారు.



గౌలిదొడ్డిలోని ఎన్ఐఏబీ క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

నేడు జై భీమ్.. జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ సమావేశం...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జై భీమ్.. జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 2025 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఎన్నుకుంటారన్నారు. సాయంత్రం 5 గంటలకు ఉప్పర్‌పల్లిలో నిర్వహించనున్న సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

మగ్గం పనిలో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మగ్గం పనిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ ఆర్‌సెట్ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముచ్చింతల్ శివారులోని ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 30 రోజుల పాటు సాగే ఈ శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఈ శిక్షణకు హాజరుకావచ్చునన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్: 7893121143 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌సీయూ ఆర్థిక అధికారిగా శ్రీనివాస్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నూతన ఆర్థిక అధికారి(ఫైనాన్స్ ఆఫీసర్)గా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆర్థిక, అకౌంట్లు, ఆడిట్, ప్రభుత్వ నిబంధనలు వంటి అంశాలపై 27 ఏళ్ల అనుభవం ఉన్న వ్యక్తికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ ఆర్థిక స్థిరత్వం, వియాన్ని నిర్ధారించడంలో కీలకంగా వ్యవహరిస్తాడని భావిస్తున్నామన్నారు.

అభివృద్ధి పనులపై శ్రద్ధ పెట్టాలి

గోల్కొండ: అభివృద్ధి పనులపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది చేపట్టిన పనులు కూడా పూర్తికాక పోవడంతో ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే గుత్తేదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. టోలిచౌకీ చౌరస్తా నుంచి ఎండీలైన్స్, టూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పైపులు వేసేందుకు భారీ గుంతలు తవ్వి వదిలేశారని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట గోల్కొండ, నానల్‌నగర్ బల్దియా వార్డు కార్యాలయ సిబ్బంది, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా విజయగణపతి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కార్తీక్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, సన్‌సిటీలోని విజయ గణపతి దేవాలయ 17వ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం గణనాథుడికి కుడుముల మాల, ఆంజనేయ స్వామికి వడమాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. స్వామివారికి మహా హారతి నివేదన అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. స్వామివారిని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ కార్తీక్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, రావుకోళ్ల నాగరాజు, మాజీ కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల సమస్యను నివారించండి

మణికొండ: నెక్నాంపూర్ చెరువులలో గుర్రపుడెక్క, దుర్గంధం పెరిగిపోయి దోమల బెడద తీవ్రమయ్యిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నెక్నాంపూర్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులో గుర్రపుడెక్కను తొలగించేందుకు తెచ్చిన యంత్రాన్ని నిరుపయోగంగా ఉంచారన్నారు. ఒకే యంత్రంతో గుర్రపుడెక్క తొలగించడం కష్టసాధ్యమన్నారు. మరిన్ని వాహనాలను తెప్పించి పనులు వేగవంతం చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ స్వామి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్ రెడ్డి, నాయకులు వేణుకుమార్, శంకర్‌సింగ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి తదితరులు

అత్తాపూర్‌లో విజిబుల్ పోలీసింగ్



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు



మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్న దృశ్యం

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఎస్ఓటీ పోలీసులతో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముష్క్ మహల్, నెక్లెస్ రోడ్, బారా ఇమార్ దర్గా, సెట్విన్ తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. ముష్క్ మహల్ ప్రాంతంలో మురారి ప్రభాకర్‌తో పాటు మరో ఇద్దరితో కలిసి మద్యం సేవిస్తుండటంతో కేసులు నమోదు చేశారు. పేకాట ఆడుతున్న కిషన్‌బాగ్‌కు చెందిన సయ్యద్ ఫక్రుద్దీన్, మొహమ్మద్ ఇమ్రాన్, అజీయుద్దీన్, మీర్ అజామ్ ఆలీ, సయ్యద్ మెరాజ్, మొహమ్మద్ వాజీద్, మొహమ్మద్ అజీమ్‌ల పై కేసులు నమోదు చేసి వారి నుంచి నుంచి రూ.60,520 నగదు, రెండు సోలార్ లైట్లు, ఆరు సెట్ల గేమింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి భూమి పూజ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని చారిత్రక శ్రీ మాత పోచమ్మ తల్లి దేవాలయ ముఖద్వారం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయాన్ని భక్తులు, కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ముఖ ద్వారాన్ని నిర్మించేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఉమారెడ్డి, గణేష్, శ్రీధర్, కిరోసిన్ రాజు, పి.జంగయ్య, పి.వి.శ్రీనివాస్, శివరాములు, బి.బాల్‌రాజ్, రాకేశ్, వి.రమేశ్, కె.శంకర్, శ్రీకాంత్, కె.శ్రీను, మహేశ్, మెస్త్రి వెంకటేశ్, సతీష్, పంతులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐకి ఘనంగా వీడ్కోలు



ఎస్ఐ తిరుపతిరావుకు కేక్ తినిపిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన తిరుపతిరావు ఆదివారం ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. 42 ఏళ్లుగా పోలీస్ శాఖకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అంతకుముందు కమిషనరేట్ కార్యాలయంలో ఆయనను సన్మానించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అలసత్వం తగదని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్‌లోని సాయిబాబానగర్‌లో రోడ్ టూ డోర్ చెత్త సేకరణను పరిశీలించారు. కాళీమందిర్ ప్రధాన రహదారి, బండ్లగూడ ఫ్రైడే మార్కెట్‌లో స్వీపింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు గణేష్, సుధాకర్‌రెడ్డి, శానిటరీ జవాన్లు రామాంజులు, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.